ఆరోగ్యసిరి

- ఏయూ యోగా విలేజ్‌లో మిల్లెట్ బాక్స్
- సిరిధాన్యాలతో ఇడ్లీ, దోశ, ఊతప్పం తయారీ
- మైదా, గోధుమ పిండి లేకుండా చపాతీలు



యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్


ఏయూ క్యాంపస్: ఆరోగ్య రక్షణకు మనం తీసుకునే ఆహారం దోహదపడుతుంది. పూర్వీకుల నుంచి మనకు కొన్ని నిర్దిష్టమైన ఆహార పదార్థాలు, అలవాట్లు వస్తుంటాయి. మన తాతలు, తండ్రులు దీర్ఘకాలం రోగాలకు దూరంగా జీవనం గడపడానికి ఇవి ఎంతో ప్రధాన భూమిక పోషించాయి. నేడు పట్టణ ప్రజలు తమ ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ అవసరమైన ఆహారాన్ని అన్వేషించుకుంటున్నారు. రుచితో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడానికి ఇష్టపడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బీచ్ రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో కొత్తగా మిల్లీ బాక్స్ చిరుధాన్యాల ఆహార పదార్థాల విక్రయ కేంద్రం ప్రారంభించారు. విభిన్న రకాల సిరిధాన్యాలను ఉపయోగించి ఇక్కడ అనేక రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు.

ఇడ్లీ నుంచి చపాతీ వరకు..

సిరిధాన్యాల కిచెన్ మిల్లెట్ బాక్స్‌లో జొన్న, సజ్జ, రాగులతో చేసిన ప్రత్యేక ఇడ్లీలు, ఊతప్పం, గుండ పొంగడాలు, దోశ, పాయసం, మురుకులు, మైదా, గోధుమ పిండి వినియోగించకుండా సిరిధాన్యాల చపాతీలు, సంప్రదాయ విధానంతో తయారు చేసిన ఫిల్టర్ కాఫీ, హెర్బల్ టీ, తట్టె ఇడ్లీ(సిరిధాన్యాల ఆవిరి కుడుము), చిట్టి పెసరట్టు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఆర్డర్‌పై సిరిధాన్యాలతో చేసిన లడ్డూలు, మురుకులు, మైదా, గోధుమ పిండి లేకుండా తయారు చేసిన జొన్న, సజ్జ, రాగి, ఊదల రోటీలు పచ్చివి విక్రయిస్తున్నారు. మొత్తం 9 రకాల సిరిధాన్యాలతో రోటీలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి సిబ్బందికి ఉంది. వీటితో పాటు ఇంటికి పట్టుకువెళ్లి చేసుకునే విధంగా సిరిధాన్యాలతో చేసిన ఇడ్లీ, దోశ పిండిని సైతం విక్రయిస్తున్నారు.

ప్రత్యేకమైన స్టాల్

ఏయూ యోగా విలేజ్‌ని ఆనుకుని బీచ్‌రోడ్డులో ప్రత్యేకంగా మిల్లెట్ బాక్స్ విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇడ్లీలను ప్రత్యేకంగా తయారు చేసిన అడ్డాకులో పెట్టి ఉడికిస్తారు. మూడు ఇడ్లీలు రూ.70, నెయ్యి–కారంతో మూడు ఇడ్లీలు రూ.80కు విక్రయిస్తున్నారు. వేరుశనగ పలుకులు, కొబ్బరి, ఉల్లి–టమాట, గుల్లశనగపప్పు చట్నీ, సాంబారుతో వీటిని అందిస్తున్నారు. త్వరలో సాయంత్రం వేళల్లో సైతం ఈ స్టాల్‌ను అందుబాటులో ఉంచే ఆలోచన చేస్తున్నారు.



సిరిధాన్యాల ఊతప్పం



జొన్న, సజ్జ, రాగి ఇడ్లీలు



స్టాల్ వద్ద నిర్వాహకుడు ప్రజ్ఞానంద్

నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యం

ప్రజలకు శత శాతం ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం, సిరిధాన్యాల వినియోగం పెంచేలా ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశాం. రైతుల నుంచి నేరుగా సిరిధాన్యాలను కొనుగోలు చేస్తున్నాం. కొన్ని ప్రత్యేక వంగడాల విత్తనాలు రైతులకు అందించి, పండిచే ప్రయత్నం కూడా చేస్తున్నాం. నాణ్యతకు, శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ప్రజ్ఞానంద్, నిర్వాహకుడు

దంచికొట్టిన వర్షం



వర్షం నీటితో నిండిన బీచ్‌రోడ్డు



హనుమంతవాక ప్రాంతంలో కురుస్తున్న వర్షం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఆగకుండా కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. వీధుల్లో కాలువలు పొంగిపోయి వరద నీరు రోడ్ల మీదకు చేరింది. కంబాల కొండ నుంచి వచ్చిన వరద నీటితో గెడ్డలు పొంగిపొర్లాయి. జనం ఇళ్లకు పరిమితమయ్యారు. బయటకు వెళ్లినవారు ఆ సమయంలో తిరిగి ఇళ్లకు చేరలేక బస్టాపులు, షాపుల వద్ద గడిపారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు ఆటంకం కలిగింది. బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. పెదగదిలి, తోటగరువు మధ్య బ్రిడ్జిపై కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది.

బీచ్ రోడ్డు జలమయం

బీచ్ రోడ్డు: భారీ వర్షానికి బీచ్ రోడ్డు జలమయమైంది. ఆదివారం కావడంతో బీచ్‌కు అధిక సంఖ్యలో తరలివెళ్లిన నగరవాసులు వర్షానికి చిక్కుకుపోయారు. వర్షం తగ్గుముఖం పట్టాక రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అటవీ హక్కుల చట్ట సవరణ తగదు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: అటవీ హక్కుల చట్టం–1980 సవరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ అడవుల నిర్మూలనను నియంత్రించడానికి 1980లో కేంద్రం రాజ్యాంగబద్ధంగా అమలులోకి తెచ్చిన చట్టానికి సవరణలు చేసేందుకు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు 2021లో సంబంధిత మంత్రిత్వ శాఖ చేసిందన్నారు. ఈ చట్టానికి సవరణలు చేస్తే గిరిజనులకు కనీస భద్రత లేకుండా పోతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కితీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్త డాక్టర్ ఎల్.రాధాకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న కొండంత హనుమంతుడు



హనుమంతవాక వద్ద సిద్ధమవుతున్న ఆంజనేయస్వామి విగ్రహం

ఆరిలోవ: హనుమంతవాక వద్ద పేరుకు తగినట్టు హనుమాన్ విగ్రహం రూపుదిద్దుకుంటోంది. సుమారు 40 అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి విగ్రహం ఇక్కడ సిద్ధమవుతోంది. బీఆర్‌టీఎస్ కూడలి సమీపంలో ఆరిలోవ వైపు వెళ్లే రోడ్డు పక్కన జీవీఎంసీ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో కొండ దిగువన ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం అటుగా వెళ్లే వాహనచోదకులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొద్ది రోజుల్లో ఈ విగ్రహావిష్కరణ జరగనుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

రేపు విద్యా సంస్థల బంద్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకుడు పడాల గోవింద్

మద్దిలపాలెం: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల భారాన్ని నిరసిస్తూ ఈ నెల 25న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని ఏఐవైఎఫ్ నాయకుడు పడాల గోవింద్ తెలిపారు. ఈ మేరకు 15, 16వ వార్డుల్లోని విద్యార్థి నాయకులతో ఆదివారం మద్దిలపాలెం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మధురెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీచ్‌రోడ్‌లో మొక్కల పెంపకం



సాగర్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనంపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇందులో భాగంగా రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో రోడ్ల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే పనులను జీవీఎంసీ అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే నగరంలో అనేక చోట్ల పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. అదేవిధంగా ఈ రోడ్డు వెంబడి శనివారం, ఆదివారం సుమారు 5 వేల మొక్కలు నాటారు.

క్లుప్తంగా

బాలుర గృహంలో దంత వైద్య శిబిరం



బాలుడికి దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: స్థానిక దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఆదివారం విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. బాలురకు దంత పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, టూత్ పేస్టులు అందజేశారు. దంత వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆయా సంస్థ ప్రతినిధులు భూషన్‌కుమార్, నీరజ, సిస్టర్ రామేశ్వరి, సిస్టర్ లలిత, సిస్టర్ కృష్ణవేణి ప్రధుమన్న, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో అలల ఉధృతి



సాగర్‌నగర్ గెడ్డను తాకుతున్న కెరటాలు

కొమ్మాది: తీరంలో అలల తాకిడి ఉధృతంగా ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తీరంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. ఇప్పటికే మత్స్యకారులు పడవలు, బోట్లు, వలలు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదిలా ఉండగా సముద్రం భీమిలి జగ్గారావు తోట వద్ద, మంగమారిపేట బేవాచ్ పార్కు వద్ద, సాగర్‌నగర్ బీచ్ గెడ్డ వద్ద ముందుకు వచ్చింది. తీరం కోతకు గురి కావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎల్ఐసీ వర్కింగ్ వుమన్ కో-ఆర్డినేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఎల్ఐసీ వర్కింగ్ వుమన్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ 22వ వార్డులో పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ సూర్యప్రభ మాట్లాడుతూ విద్యార్థులకు కావల్సిన నోటు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్స్, తదితర పరికరాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.కామేశ్వరి, తిరుమల, హరి జ్యోతి, పద్మావతి, గోవింద్ శ్రీనివాసరావు, ప్రసన్న, శ్రీదేవి, లక్ష్మి, పద్మ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరావు మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకు పోలీసు సిబ్బంది అప్పగించారు.

క్రాంతికుమార్ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందుకుంటున్న క్రాంతికుమార్ కుటుంబ సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మద్దిలపాలేనికి చెందిన కనకల క్రాంతికుమార్ కుటుంబానికి పలువురు దాతలు చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఉరిపోసుకుని క్రాంతికుమార్ మరణించడం తెలిసిందే. ఈయనకు తల్లి, భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారంతా దిక్కుతోచని స్థితిలో ఉండడంతో అండగా నిలవాలని ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భాస్కరరావుతో పాటు సహచరులు, స్నేహితులు నిర్ణయించారు. ఇలా రూ.1,33,700 సేకరించి ఆదివారం క్రాంతికుమార్ భార్య, పిల్లలకు అందజేశారు. ఇద్దరి పిల్లల పేరు మీద రూ.40 వేలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేయాలని, మిగతా సొమ్మును ఇంటి అవసరాల కోసం వాడుకోవాలని ఈ సందర్భంగా సూచించినట్టు ఎస్ఐ తెలిపారు. ఆర్థిక సాయం అందించిన వారందరికీ బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు



మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎస్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో 2023–24 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కె. కిరణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ రోటేరియన్ భాస్కర్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎండాడలో క్లబ్ నిర్వహిస్తున్న మహిళా సాధికారత కేంద్రం, హుకుంపేటలో నిర్వహిస్తున్న గిరిజన మహిళా సాధికారత కేంద్రం ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షురాలు సునీత లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో సునీత లావణ్య, ఎస్. గాయత్రి, మొదిలి మహేష్, మిరియాల వేణు, గోపాల్, డాక్టర్ ఎం. గంగాధర్, పరశురామరాజు, సత్యశ్రీ, పద్మజ, వైవీవీ సత్యనారాయణ, ఎ. కిరణ్, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దండాలమ్మా.. బంగారమ్మా..



మరిడమ్మ, బంగారమ్మకు ఉపారం తీసుకెళ్తున్న మహిళలు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ చదును పట్టు వద్ద బంగారమ్మకు, మరిడమ్మకు విశేష పూజలు జరిపారు. సాయంత్రం 4 గంటలకు చదును పట్టు వద్ద మరిడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దండుబజార్, పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, ప్రకాశరావు పేట, జడ్జికోర్టు, సింగ్‌హోటల్ జంక్షన్ మీదుగా పితాని దిబ్బలో వెలసిన బంగారమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి ఉపారం అందజేశారు. అర్ధరాత్రి 12 గంటలకు గ్రామ వీధుల్లో ఉజిడి బండి తిప్పారు.

నేడు తొలేళ్లు..

ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు గ్రామ పురవీధుల్లో పూలఘటాలు తిరగనున్నాయి. రాత్రి 7 గంటలకు కూటిఘటాలు తిరగనున్నాయి. కళావేదిక ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా కిషోర్

ఎంవీపీ కాలనీ: బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా గేదెల కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తూ విలువైన సూచనలు అందించాలని కోరారు.

జూలో 20 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. జూ సిబ్బంది, సందర్శకులు సుమారు 20 మంది ఈ శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను జూ క్యూరేటర్ నందిని సలారియా అభినందించారు.

ముగిసిన గరికిపాటి ప్రవచనాలు



ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ప్రవచించారు. అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులకు సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె. హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చలసాని ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న విప్లవ రచయిత సంఘం రాష్ట్ర నేత ప్రసాద్

సీతంపేట: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయిత సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్టు మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించినప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మతతత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రజా ఉద్యమాలకు తలలో నాలుకగా వ్యవహరించిన కలం యోధుడు చలసాని ఆశయాలను కొనసాగించాలన్నారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూమతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి 'వర్తమానం చలసాని ప్రాసంగికత'అనే అంశంపై, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత'అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జర్నలిస్టు సి.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కె.లలిత, పౌరసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, న్యాయవాది పద్మ పాల్గొన్నారు.

కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఇంటక్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

సీతమ్మధార : మణిపూర్ దారుణకాండలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించటాన్ని ఖండిస్తూ సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు తులసీరామ్, ఐద్వా కార్యదర్శి కుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు జరుగుతూ ఉంటే స్పందించాల్సిన ప్రధాని మోదీ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో హింసకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.